క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాల్మన్‌రాజు

సింహాద్రిపురం : మండల పరిధిలోని జడ్పీ హైస్కూల్ కేజీబీవీ, బీసీ హాస్టళ్లను శుక్రవారం ఎంపీడీఓ సాల్మన్‌రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందించే భోజనాలను నాణ్యతగా చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులను, వంటశాల గదులను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఓ గురుదేవి, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలి

మైలవరం : వసతిగృహాల్లో, పాఠశాలల్లో అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టాలని మండల ఎంపీడీఓ షంషాద్‌బాను తెలిపారు. శుక్రవారం మైలవరం మండల కేంద్రంలోని ఏ.పి. రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల వసతిగృహాలను ఆమె మండల విద్యాశాఖాధికారి బత్తిని చిట్టిబాబుతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. వారానికి ఒక సారి నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు.

దివ్యాంగులకు గృహోపకరణాలు వితరణ



దివ్యాంగులకు గృహోపకరణాలను అందజేస్తున్న కిషోర్‌కుమార్‌రెడ్డి, గౌస్‌మోదీన్‌లు

పులివెందుల టౌన్ : లోక్ జనశక్తి పార్టీ అధినేత రామ్‌విలాస్ పాశ్వాన్ 77వ జయంతి సందర్భంగా ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో దివ్యాంగులకు గృహోపకరణాలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు కిషోర్ కుమార్‌రెడ్డి, గౌస్‌మోదీన్‌లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కేంద్ర మంత్రిగా పనిచేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, దళిత విభాగం నాయకులు రవికుమార్, మైనార్టీ విభాగం నాయకులు అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



పూడిక తీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని సమస్యలతోపాటు డ్రైనేజీ పూడికతీత పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్యలు పలు వార్డులలో పర్యటించి పరిశీలించారు. వేంపల్లె రోడ్డులో వ్యర్థాలతో పేరుకుపోయిన డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలించారు. మురికివాడలలో, రోడ్లపైన, డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తను వ్యర్థాలను తొలగించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

బాలలకు ధార్మిక శిక్షణ తరగతులు

కడప కల్చరల్ : సనాతన ధర్మ పరిరక్షణ సేవలో భాగంగా ఈనెల 7 నుంచి నగరానికి చెందిన బాలబాలికలకు ధార్మిక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కడప నగరం జయనగర్ కాలనీకి చెందిన శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం చైర్మన్ వి.సీతారామయ్య తెలిపారు. ప్రతి ఆదివారం 5–15 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలబాలికలకు ఉచితంగా ఉదయం 9.30 నుంచి 11.00 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. బాలలకు శ్లోకాలు, పద్యాలు, వ్యక్తిత్వ వికాస కథలు, భగవద్గీత శ్లోకాలు, పురాణ ఇతిహాసాలు, ఆటల ద్వారా ఏకాగ్రత తదితర అంశాలు నేర్పేందుకు ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్యం నుంచే వారిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మికత, సత్యం, భారతీయ సంస్కృతి, మానవతా విలువలను అభివృద్ధి చేసేందుకు ఈ తరగతులు ఉపయోగపడగలవన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించండి

ఆత్మ పీడీ విజయలక్ష్మి



గొందిపల్లె గ్రామంలో తెగుళ్లు సోకిన పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

వేముల : పంటల సాగులో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని గొందిపల్లె గ్రామంలో శుక్రవారం పత్తి, వేరుశెనగ, చీనీ, ఉల్లి, కందిపంటలను కేవీకే శాస్త్రవేత్త శిల్పకల, ఎఫ్‌టీసీ ఏఓ పద్మజ, వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగడం వల్ల రైతులకు పంటల సాగులో ఆదాయం ఉంటుందన్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయే తప్ప ఆశించిన మేర దిగుబడులు అందడం లేదని రైతులకు వివరించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ పత్తిపంటలో సోకిన తెల్లదోమ, పచ్చదోమ నివారణకు డైయాబెంజూరాన్ 1.25 గ్రాములు లీటరు నీటికి లేదా థైయోమితాక్సిన్ 0.2 గ్రాములు లీటరు నీటికి లేదా ఫ్లోనికామిడ్ 0.3మి.లీ లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు నివారణకు ఉధృతినిబట్టి ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతేకాక ప్రొపానోఫాస్ 2ఎంఎల్ లీటరు నీటికి, క్లోరిఫైర్‌పాస్ 2.50 ఎంఎల్ లీటరు నీటితో పిచికారీ చేయాలన్నారు. వేరుశనగ పంటలో పచ్చదోమ నివారణకు ఇమిడాక్లోఫైడ్ 0.4 ఎంఎల్ లీటరు నీటితోను లద్దె పురుగు నివారణకు క్లోరన్‌ట్రానీవిప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటితో పిచికారీ చేయాలన్నారు. అనంతరం ఆత్మ డీపీడీ పద్మలత మాట్లాడుతూ బత్తాయిలో బోరన్ లోపం వల్ల కాయలు పగలడం, ఆకులు ముదురుగా అయి గుంతలు పడుతున్నాయన్నారు. బోరన్ లోపం నివారణకు బోరాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. అలాగే నల్లి నివారణకు బోటైట్ 2ఎంఎల్ లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. కందిపంటలో చిత్తపురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ లీటరు నీటికి లేదా క్లోరిపైర్‌పాస్ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉల్లి పంటలో మొదలు కుళ్లు తెగుళ్ల నివారణకు సాఫ్ 2 గ్రాములు లీటరు నీటితో లేదా ఎక్సాకోనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి పిచికారీ చేసుకుని నివారించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే వీఏఏ లక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం నరాల, గుండెజబ్బుల వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఉచితంగా రేబిస్ టీకా

ముద్దనూరు : ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఈనెల 6వ తేదీన శునకాలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వేస్తున్నట్లు స్థానిక పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస తెలిపారు. ముద్దనూరు, కొండాపురం మండలాల్లోని అన్ని ప్రాంతాల్లో నేడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను వేయనున్నట్లు, పెంపుడు కుక్కలకు కూడా ఈ టీకా అందివ్వనున్నట్లు ఆయన తెలిపారు. కుక్కలకు ఈ టీకా వేయడం వల్ల మనుషులకు రేబిస్ వ్యాధి రాకుండా అరికట్టవచ్చని ఆయన తెలిపారు.

ఎర్రగుంట్ల : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని పశుగణాభివృద్ధి ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు పశుగణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మునెయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు పశువైద్యశాలలకు వచ్చిన వారి కుక్కలకు టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు.

సుధాకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ



సుధాకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : ఎగువపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.చదువుల సుధాకర్‌రెడ్డి ఇటీవల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాలేదన్న ఆవేదనకు గురై గుండెపోటు సంభవించి మృతి చెందాడు. అప్పట్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం సుధాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసానిచ్చారు. సుధాకర్‌రెడ్డికి భార్య నాగేశ్వరి, కుమారులు పరమేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డిలు ఉన్నారు. వారిని అన్నివిధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, జ్యోతిరెడ్డి, విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డి కుటుంబీకులకు ఎంపీ పరామర్శ

ముద్దనూరు : మండలంలోని వేల్పుచెర్ల గ్రామంలో మూడురోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శిరియపురెడ్డి శివారెడ్డి కుటుంబీకులను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం ఎంపీ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి వేల్పుచెర్లలోని శివారెడ్డి ఇంటికి వెళ్ళారు. శివారెడ్డి భార్య, కుమారులు డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, మణికంఠరెడ్డిలను ఆయన పరామర్శించి, వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



చెన్నూరులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు



జమ్మలమడుగులో ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



వేంపల్లెలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసాబేగం

చెన్నూరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అరుంధతినగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే భోజనానికి ముందు చేతులు శుభ్రపరచుకోవాలన్నారు. గ్రామంలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. అలాగే ప్రతి ఫ్రైడే డ్రై డే గురించి వివరించారు. సీజన్లో వచ్చే డయేరియా, డెంగ్యూ, మలేరియా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంఓ మనోరమ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.చెన్నారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, ఏఎంఓ వెంకటరెడ్డి, సూపర్‌వైజర్ రిబక, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డయేరియాపై విద్యార్థులకు అవగాహన

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నీసాబేగం విద్యార్థులకు డయేరియాను ఎలా అరికట్టాల అనే విషయంపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత మన చుట్టూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అతిసార వ్యాధి లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ బాబా ఫకృద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ సుగుణమ్మ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో విద్యార్థులకు అతిసారపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి

ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

జమ్మలమడుగు : ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ తాడిపత్రి రహదారిలో ఉన్న ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో పారిశుద్ధ్య చర్యలతోపాటు, నీటి సరఫరా నిరంతరాయంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం

ఎర్రగుంట్ల : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలన్నీ దూరం అవుతాయని చిలంకూరు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి తెలిపారు. శుక్రవారం చిలంకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అతిసార నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పుల్లమ్మ, సీహెచ్‌ఓ శోభారాణి, ఆశా కార్యకర్తలు, టీచర్లు పాల్గొన్నారు.


నూతన చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడ్వకేట్ ఉమ

వల్లూరు : కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కడపలోని వన్ స్టాప్ సెంటర్ అడ్వకేట్ ఉమ తెలిపారు. మండల పరిధిలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు అమలులో వున్న ఇండియన్ పీనల్ కోడ్‌ను కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహితగా మార్చిందన్నారు. ఇందులోని నూతన చట్టాలను గురించి అవగాహన కలిగి వుండాలన్నారు. మహిళలు, పిల్లలు తమ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి, పోలీస్ స్టేషన్‌లో ఎలా ఫిర్యాదు చేయాలి అనే విషయాలను గురించి అవగాహన కల్పించారు. జీరో ఎఫ్ఐఆర్, 1098, 181 ద్వారా ఫిర్యాదు చేయడం, బాల్య వివాహాలు, పిల్లలు, మహిళలు వారు చదువుకునే చోట, పని చేసే చోట తోటి వారితో ఎదర్కొనే సమస్యలు, వాటి పరిష్కారాలను గురించి వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడే వారు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నూతన చట్టాలను గురించి అవగాహన పెంపొందించుకుని, అవసరమైనప్పుడు సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ వసంతభాయి తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్ వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, విద్యార్థులు హాజరయ్యారు.

సంపూర్ణత అభియాన్ లోగో ఆవిష్కరణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ షకీలాబేగం

చింతకొమ్మదిన్నె : సంపూర్ణత అభియాన్ లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ షకీలాబేగం ఆవిష్కరించి మాట్లాడారు. భారత ప్రభుత్వం చింతకొమ్మదిన్నె మండలాన్ని ఆకాంక్షాత్మక అభివద్ధి బ్లాక్ కింద ఎంపిక చేసిందన్నారు. అందులో భాగంగా వ్యవసాయ శాఖ, ఆరోగ్యశాఖ, మాతా శిశు సంరక్షణ శాఖ, విద్యాశాఖ, వెలుగు శాఖలో పలు అభివద్ధి పనులను సెప్టెంబర్ చివరి నాటికి 100% నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలనగా వాటి అన్నింటిని పూర్తి చేసి 100% లక్ష్యాన్ని చేరుకున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ సునీల్‌కుమార్, డీఎంహెచ్ఓ నాగరాజు, ఉమామహేశ్వరరావు, ఎంఈఓ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టంట్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

కమలాపురం : డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యోగి వేమన యూనివర్శిటీ అధికారులు డిగ్రీకి సంబంధించిన అన్ని పరీక్షలకు ఇన్‌స్టంట్ అవకాశం కల్పించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021–2024లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు వైవీయూ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. 4వ సెమిస్టర్ వరకు ఒక్క పరీక్షకు మాత్రమే అవకాశం ఇవ్వడం కారణంగా వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైవీయూ అధికారులు స్పందించి అన్ని పరీక్షలకు ఇన్‌స్టంట్ అవకాశం కల్పించాలని ఆయన అందులో పేర్కొన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ఓబులేసు

పెండ్లిమర్రి : ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే ప్రతి రైతుకు వారి పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి మట్టి పరీక్షలు తప్పని సరిగా చేయించాలని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతు భరోసాకేంద్రం సిబ్బందికి నిర్వహించిన సమావేశం మాట్లాడారు. రైతుల పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయిస్తే వాటికి అనుగుణంగా పంటలకు ఎరువులు వాడవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో పొలంబడి నిర్వహించాలన్నారు. పీఎం కిషాన్‌కు ఈకేవైసీ తప్పని సరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని కడప ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న స్వీపర్లకు ఇస్తున్న వేతనంలో కోత కోస్తున్న విక్టర్ అసోసియేషన్ అధినేత, కాంట్రాక్టర్ వాసుదేవకుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకట సుబ్బయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ స్వీపర్లకు రూ. 11,202 వేతనం ఇవ్వాల్సి ఉండగా, రూ. 9,100 ఇచ్చి దోచుకోవడమే కాకుండా తిరిగి రూ. 3000 వెనక్కి తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా కట్టడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్‌గా చేరినప్పటి నుంచి ఇలాగే చేస్తున్నాడని విమర్శించారు. బస్సులను శుభ్రపరుస్తున్న కార్మికులకు రూ. 6 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు.

మీ కోసం కార్యక్రమానికి తప్పక హాజరు కావాలి

సింహాద్రిపురం : ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల కోసం జరిగే మీ కోసం కార్యక్రమానికి అధికారులందరూ తప్పక హాజరుకావాలని తహసీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ సోమవారం ఉదయం 8.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరు మీ కోసం కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఎవరికీ సోమవారం రోజు సెలవులు ఇవ్వడం జరగదన్నారు. హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



లక్ష్మిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

పెద్దముడియం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రామానికి చెందిన బైరెడ్డి సూర్య నారాయణరెడ్డి, సుశీలమ్మ ట్రస్ట్ తరపున వారి కుమారుడు లక్ష్మిరెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పదవ తరగతి పరీక్షలలో ప్రథమ స్థానం సాధించిన జమాల్‌బాషాకు రూ.15000, రెండవ స్థానంలో వచ్చిన గురుపూజితకు రూ.10000, మూడవ స్థానంలో వచ్చిన పద్మావతి, షాహిదాకు చెరో రూ.5000 నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్‌లు



జగనన్న హౌసింగ్ కాలనీ

పులివెందుల రూరల్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మించారు. మరికొన్నిచోట్ల పూర్తిస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో పులివెందుల పట్టణంలోని జేఎన్టీయూ కళాశాల వెనుకవైపు సుమారు 8 వేల గృహాలను నిర్మించేందుకు నిర్మాణ పనులను చేపట్టారు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. నిర్మాణాలకు సంబంధించిన దాదాపు కోట్ల రూపాయల విలువ చేసే భవన నిర్మాణ సామగ్రి ఇసుక, ఇటుకలు, కంకర, స్టీల్, తదితర వాటిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఈ విషయంపై శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు కిషోర్, ఖాదర్, రాజశేఖర్‌లు డీఎస్పీ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సంబంధించిన కొన్ని కోట్ల రూపాయల భవన నిర్మాణ సామగ్రిని అపహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డీఎస్పీని కోరారు.


విద్యుత్ అదాలత్ ద్వారా సమస్యలు పరిష్కారం



వినియోగదారుల సమస్యలు వింటున్న అధికారులు

పులివెందుల రూరల్ : విద్యుత్ అదాలత్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక చైర్మన్ శ్రీనివాస ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న మినీ సెక్రటేరియట్ కార్యాలయం నందు విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అదాలత్‌లో పులివెందుల డివిజన్ పరిధిలోని వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సర్వీసులు, ఇంటి మీద ఉన్న విద్యుత్ లైన్లు, బిల్లుల సవరణకు సంబంధించిన సమస్యలు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ అంజన్‌కుమార్, ఫైనాన్స్ మెంబర్ రామ్మోహన్‌రావు, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మ, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ మధుకుమార్, ఈఈ శ్రీనివాసులు, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన దిగుడు బావి



గురిజాల గ్రామంలో అతిపురాతన దిగుడుబావి



మరమ్మతు పనులు చేస్తున్న గ్రామస్తులు

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన అతిపురాతన దిగుడుబావి ఉంది. ప్రస్తుతం ఆ దిగుడు బావి అంతరించిపోకుండా గ్రామస్తులు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ దిగుడు బావికి అప్పటి కాలంలోనే ఎంతో నైపుణ్యంతో వర్షపు నీరు ఆ బావిలోకి వచ్చి చేరేటట్లు తూమును ఏర్పాటు చేశారు. అలాగే దిగుడు బావికి చుట్టూ రాతికట్టడం కూడా ఏర్పాటు చేశారు. మొదట్లో 20 అడుగుల మేర ఏటవాలుగా రాతితో బండ చప్పట పరిచారు. దిగుడు బావిలో 44 మెట్లు ఏర్పాటు చేశారు. అక్కడ మళ్లీ మెట్ల లోతులో తాళ్ల సహాయంతో నీటిని చేదుకోవడానికి పెద్ద బండలను ఏర్పాటు చేశారు.

ఎప్పటికీ బావిలో ఇంకిపోని నీరు

ఈ దిగుడు బావిలో ఎప్పటికీ నీరు ఇంకిపోకుండా ఉంటాయి. పూర్వం అవధూత కోడిమూర్తి భయ్యారెడ్డిస్వామి నీటిపై తపస్సు చేస్తూ ఆ నీటిని మంత్రించి ఉండటంతో ఈ బావి నీటిని పవిత్రమైన నీరుగా ప్రజలు భావిస్తారు. గ్రామంలో పూర్వీకుల కాలం నుంచి ఎవరికైనా పాము కరచినా, అనారోగ్య సమస్యలు వచ్చినా దిగుడు బావి వద్ద ఉన్న పురాతన రాతి స్తంభాలతో ఏర్పాటు చేసిన కమ్మల కట్టమీద మూడు రోజులపాటు నియమ నిష్ఠలతో ఈ నీరు తాగితే రోగాలు నయమవుతాయని ఇప్పటికీ గ్రామస్తులు నమ్ముతారు. ఇప్పటికీ కూడా ఈ ఆచారం గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. ఈ బావిని గ్రామస్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.

బావికి మరమ్మతుల చేస్తున్న గ్రామస్తులు

దిగుడుబావి రాతికట్టడం కూలడంతో గ్రామస్తులు చందాలు వేసుకుని బావికి మరమ్మతు పనులు చేపట్టారు.